నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | డిసెంబర్ 25, 2024 | www.navatelangana.com

నియో లిటిల్ ఫ్లవర్‌లో త్రీడి షో

- తిలకిస్తు ఉత్సాహం చూపిన విద్యార్థులు





త్రీడి షోలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో త్రిడీ ప్లానెటేరియం షోను మంగళవారం నిర్వహించారు. రోబో చాంప్ ప్లానెటేరియం స్టెమ్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అంతరిక్షానికి సంబంధించిన విషయాలను విద్యార్థులు 3డీ షో ద్వారా తెలుసుకున్నారు. అలాగే అనేక కొత్త విషయాలను తెలుసుకున్నట్టు విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజూరి అరుణ్, ప్రిన్సిపాల్ రవి కిరణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మూడు నెలల పసికందు మృతి



పసికందు మృతదేహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు నెలల పసికందు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల శిశుగృహంలో మంగళవారం చోటు చేసుకుంది. మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని జీజీహెచ్‌లో ఓ మహిళ సెప్టెంబర్ 15న శిశువుకు జన్మనిచ్చింది. తక్కువ బరువుతో పుట్టిన పాపను ఆమె చెత్తబుట్టలో పడేసి వెళ్లిపోయింది. స్పందించిన శిశుగృహ సిబ్బంది పసికందు ఆలనా పాలన చూస్తున్నారు. అయితే శరీరమంతా ఇన్‌ఫెక్షన్ కారణంగా మంగళవారం శిశువు మృతిచెందింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు.

ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యం

- నిజాంసాగర్ ఎస్‌బీఐ అధికారుల తీరు
- ఏ పనికోసం వెళ్లినా.. గంటల తరబడి ఆగాల్సిందే
- బ్యాంకుకు వెళ్తే సమయం వృథా అవుతోందని ఖాతాదారుల ఆవేదన

> మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్తే.. తమ సమయం వృథా అవుతుందని ఖాతాదారులు అంటున్నారు. బ్యాంకు పనినిమిత్తం వెళ్తే అధికారుల నిర్లక్ష్యం.. అలసత్వంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. అలాగే ఎస్‌బీఐ బ్యాంక్ పక్కనే గల ఏటీఎం పనిచేయకపోవడంతో డబ్బులు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిజాంసాగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్.. పక్కనే బంద్ ఉంచిన ఏటీఎం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ ఉమ్మడి మండలానికి ఎస్‌బీఐ బ్యాంక్ ఒకటే ఉంది. ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలో వేలమంది ఖాతాదారులున్నారు. ప్రధానంగా మండలంలోని 27 గ్రామపచాయతీలలోని రైతులు, మహిళా సంఘాలు, సాధారణ ఖాతాదారులు ఈ బ్యాంకులోనే ఉన్నారు. వివిధ బ్యాంక్ పనుల నిమిత్తం బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు అధికారులు సరైన సేవలు అందించడంలో విఫలమవుతున్నారు. ఈ బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నా.. ఇతర ఏ బ్యాంక్ పనిమీద వెళ్లినా గంటల తరబడి వెయిట్ చేయిస్తున్నారని ఖాతాదారుల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బ్యాంక్ అధికారులు ఇలా.. ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యం నిర్లక్ష్యం వహిస్తున్నారని మండలంలోని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు.

పనిచేయని ఏటీఎం..

ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలో ఎస్‌బీఐకి సంబంధించిన ఏటీఎం మండలంలో ఒక్కటే ఉంది. అది కూడా బ్యాంక్ పక్కనే ఉంది. అది ఎప్పుడు తెరిచి ఉంటుందో ఎప్పుడు మూసి ఉంటుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఏటీఎం కలిగి ఉన్నవారు, కొత్తగా ఏటీఎం వచ్చినవారు ఏటీఎం పిన్ జనరేట్ కోసం ఏటీఎంకి వెళ్తే మూసి ఉంటుందని ఖాతాదారులు తెలుపుతున్నారు. కొత్తగా వచ్చిన ఏటీఎం పిన్ జనరేట్ చేయాలంటే అది కేవలం ఎస్‌బీఐ ఏటీఎంలోని మొదటిసారిగా పిన్ జనరేట్ చేయాల్సి ఉంటుంది. పిన్ జెనరేట్ కోసం వివిధ గ్రామాల ఖాతాదారులు బ్యాంకుకు వెళితే మూసే ఉంటుంది. ఏటీఎం కోసం బ్యాంక్ అధికారులను అడిగితే 'తెరిచే వరకు ఆగండి' అంటూ కోపంగా సమాధానం చెబుతున్నారని ఖాతాదారులు అంటున్నారు. మండలంలో ఒకే ఒక్క ఎస్‌బీఐ ఏటీఎం ఉండడం వలన పిన్ జనరేట్ చేసుకోవడం కోసం మూడు నాలుగు రోజులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నామని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎస్‌బీఐ అధికారులు స్పందించి బ్యాంక్‌కు వచ్చే ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాలని, అలాగే ఏటీఎంను నిత్యం తెరిచే ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వేకు సర్వర్ సమస్య

- కొనసా..గుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే
- త్వరగా పూర్తిచేయాలంటున్న అధికారులు
- సర్వర్ రాకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు
- సమస్యను పరిష్కరించాలని వేడుకోలు



సర్వర్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడానికి ప్రభుత్వ అధికారులతో, సిబ్బందితో ఆన్‌లైన్ సర్వేను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే గత కొద్ది రోజుల నుంచి సర్వేలో భాగంగా సర్వర్ సమస్యలు రావడంతో ఆన్‌లైన్ నమోదులో జాప్యం జరుగుతోంది. దీంతో సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తూ సర్వే నిర్వహిస్తున్నారు. తప్పులు లేకుండా త్వరితగతిన సర్వేను పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. అయితే సర్వర్ సమస్యతో ఉన్నతాధికారులు ఇచ్చిన రోజువారి సర్వే లక్ష్యాన్ని చేరుకోలేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సర్వర్ సమస్యలను పరిష్కరించాలని సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

సావిత్రిబాయి పూలే పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీటీయు ఆధ్వర్యంలో జనవరి 5న న్యూ అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న సావిత్రి బాయి పూలే పురస్కారాల కరపత్రాలను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతి రెడ్డి మంగళవారం తమ కార్యాలయాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలోనే స్త్రీ విద్యను మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టిన ఘనత పూలే దంపతులకు దక్కుతుందని తెలిపారు. వారిని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని బోధన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచరి రవికుమార్, కొట్టూరు రామకృష్ణ, అసోసియేటేడ్ అధ్యక్షులు ఎ.మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్, గౌరవ సలహాదారులు రమణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



చేపల యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-లింగంపేట్

ప్రభుత్వ సహకారంతో మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలోని బాయంపల్లి గ్రామంలో ఐకెపి ఆర్థిక సహకారంతో చేపల పెంపకం, చేపల దాన తయారు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. చేపల పెంపకం దానతయారు చేసేందుకు బ్యాంకు లింకేజి, స్త్రీ నిధి ద్వారా కుంట యశోదకు రూ.3.50 లక్షలు రుణం మంజూరు చేసిన యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చేపల పెంపకం, దాన తయారీకి కుటుంబం మొత్తం కృషి వలన ఆర్థిక స్తోమత పెరుగుతుందన్నారు. చేపల పెంపకంపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా మత్స్య శాఖాధికారి ఆదేశించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సహకారం అందిస్తామని పేర్కొన్నారు. మహిళలు వ్యాపారంగంలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. పురుషులతో పోటీ పడుతున్నారని, అలాగే అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మత్స్య శాఖాధికారి శ్రీపతి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ నరేష్, ఎంపీఓ మలహరి, ఐకెపి సీసీలు మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి బడ్జెట్ పెంచాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు లక్ష్మారెడ్డి
- కామారెడ్డి జిల్లా 5వ మహాసభ



మాట్లాడుతున్న రాష్ట్ర బాధ్యులు లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర బాధ్యులు లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్) కామారెడ్డి జిల్లా 5వ మహాసభను మంగళవారం స్థానిక భాగ్యరెడ్డి వర్మ ప్రాంగణం, బాలుర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి హాజరై ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ప్రతి ఏటా ఒక్కో శాతం బడ్జెట్‌ను తగ్గిస్తూ తొమ్మిది సంవత్సరాల్లో 14 శాతం నుంచి 6 శాతానికి తీసుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిందని, బడ్జెట్‌లో కేవలం 7శాతం మాత్రమే నిధులు కేటాయించడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని చేసిన విధ్వంసాన్ని సరిచేయాలంటే తక్షణమే నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న పర్యటనలను మరింత వేగవంతం చేయాలని, తల్లిదండ్రుల నుంచి, సమాజంలోని మేధావివర్గం, ఉపాధ్యాయుల నుంచి తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భాన్ని తల్లిదండ్రులు, మేధావులను ఉపయోగించుకుని విద్యా రంగ అభివృద్ధి కోసం విద్యా కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అన్నారు. అదేవిధంగా 317 జి.ఓ. వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరినీ తమ సొంత జిల్లాలకు పంపించాలని, ఉద్యోగుల పట్ల మరణ శాసనంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రి ప్రైమరీ తరగతులను ప్రారంభించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని కేటాయించాలని అన్నారు. పండిట్, పి.ఈ.టి. అప్‌గ్రెడేషన్‌కు ముందున్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల ప్రమోషన్ల కోసం ఎస్‌జిటిలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డి.ఏలను ప్రకటించాలని, పిఆర్సి రిపోర్టును వెంటనే తెప్పించుకోవాలని, ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉండి మూలుగుతున్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ మంజూరు చేయాలని, ఎస్ఎస్ఏ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను, ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, రెసిడెన్షియల్ స్కూల్ టైమింగ్స్ సాధారణ పాఠశాలల మాదిరి మార్చాలని, రెసిడెన్షియల్, కేజీబీవి, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ, హాలిడే డ్యూటీ నుంచి మినహాయించాలని, ఎయిడెడ్ టీచర్స్‌కు ప్రతి నెల వేతనాలు అందించాలని, మోడల్ స్కూల్ టీచర్స్‌కు ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించాలని, ఎయిడెడ్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, కేజీబీవి, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం రాబోయే రెండు సంవత్సరాలకు జిల్లా ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆకుల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎ.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులుగా బి.వెంకటరెడ్డి, ఏమిలియా జిల్లా కోశాధికారి ఎస్.వి.రూప్ సింగ్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా కె.రాజవర్ధన్, జిల్లా కార్యదర్శులుగా ఎం.గోపాల్, ఎం.గోపాల్, యన్.నారాయణ, ఎస్.బాలయ్య, సాయిగౌతమ్, ఎ.దయాకర్, బి.నాంపల్లి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సుధాకర్, వి.వసవయ్య, సభ్యులుగా,జె.గణపతి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్‌గా ఎం.గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.సత్యానంద్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బాధ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఉపాధికి నాబార్డు నిధులు

- జిల్లా నాబార్డ్ అధికారి గంగాధర్



మాట్లాడుతున్న నాబార్డు అధికారి గంగాధర్

నవతెలంగాణ-లింగంపేట్

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగడానికి నాబార్డ్ సంస్థ ముందుందని జిల్లా నాబార్డ్ అధికారి గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మత్స్యకారులకు అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామ మత్స్యకారులు 300 నుంచి 750 మంది ఒక సంఘంగా ఏర్పడాలన్నారు. ఒక్కొక్క సభ్యుడు రూ.2100 సంఘానికి జమ చేస్తే నాబార్డ్ ఒక్కొక్కరికి రూ.2,100 జమ చేస్తుందన్నారు. దీని ద్వారా చేపల వ్యాపారం, రవాణా సౌకర్యం, చేపల పెంపకం చేయవచ్చునని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు ఉపాధి కల్పించడానికి మత్స్య సంపాదన పెంచడానికి రాయితీలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. మత్స్యకారుల మహిళా సంఘాలు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధికారి శ్రీపతి, జిల్లా చైర్మన్ సత్యనారాయణ, మత్స్య శాఖ సిబ్బంది సురేష్, శ్వేత, ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా..

- విద్యుత్ శాఖ చర్యలు
- రాబోయే వేసవి కాలానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నాం
- కామారెడ్డి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెల్లడి
- అశోక్‌నగర్ కాలనీలో మరమ్మతు పనులు




నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

రాబోయే వేసవి కాలానికి విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రకాల నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కామారెడ్డి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వేసవి కాలం డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని, రాబోయే వేసవిలో పెరగబోయే డిమాండ్ అంచనా మేరకు ప్రణాళిక బద్ధంగా అంచనాలు సిద్ధం చేసి సమయానుగుణంగా తగిన మంజూరును తీసుకుని.. 33/11 సబ్ స్టేషన్‌లలోని 02 నెంబర్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. గడచిన సంవత్సర కాలంలో గరిష్ట డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డిటిఆర్)పై లోడ్ భారం ఎంత ఉందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకొని అందుకు అనుగుణంగా కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చనున్నట్టు వివరించారు. లోడ్ మేరకు 59 నెంబర్ల ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామన్నారు. మెరుగైన, నాణ్యమైన, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా అందించడానికి 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్టపరిస్తూ ప్రతి ఒక్క 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి అవసరమైన పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు.

ఓవర్ లోడ్ ఉన్న 33 కెవి, 11 కెవి ఫీడర్లను గుర్తించి అందుకు అనుగుణంగా లోడ్ రిలీఫ్ చేయడానికి లోడ్ బదలాయింపు చేస్తున్నామని, తద్వారా లోడ్ భారం తగ్గి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవు తుందని వివరించారు. మున్సిపాలిటీ టౌన్‌లలో విద్యుత్ అంతరాయాలు సంభవించినప్పుడు అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి రింగ్ మెయిన్స్ వ్యవస్థను పటిష్ట పరుస్తూ, 11కేవీ ఫీడర్లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా విద్యుత్ వినియోగదా రులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. నిర్దిష్టమైన కార్యాచరణ ద్వారా 33 కేవీ, 11కేవీ ఫీడర్లలోని లోపాలను ముందస్తుగా గుర్తిస్తూ తగిన నిర్వహణ కార్యక్రమాలు చేపడుతూ అంతరాయాలు లేని విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇదే విధానాన్ని అనుసరిస్తూ ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డిటిఆర్) నిర్వహణ కార్యక్రమాలు చేపట్టి విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించామని తెలియజేశారు. అత్యవసర సర్వీసులో భాగమైన ఆసుపత్రి, మెడికల్ కాలేజీలు, పోలీస్ స్టేషన్‌లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైన వివరించిన విధంగా వివిధ నిర్దిష్టమైన కార్యాచరణ ద్వారా గత వేసవిలో ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని వచ్చే వేసవిలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన, విద్యుత్ సరఫరా అందించడానికి నిబద్ధతతో టీజీఎన్ పీడీసీఎల్‌లోని ప్రతి ఒక్క ఉద్యోగి కంకణ బద్ధులై పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు లక్ష్మి కాలువకు యాసంగి సాగు నీరు విడుదల



నవతెలంగాణ-మెండోరా

శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి ప్రధాన కాలువ ద్వారా నేడు ఉదయం 10:30 గంటలకు యాసంగి పంటలకు సాగు నీటి విడుదల చేసి ప్రారంభిస్తామని ప్రాజెక్టు ఇరిగేషన్ డివిజన్ 4 కార్యనిర్వహక ఇంజనీర్ టి.భానుప్రకాష్ తెలిపారు. విలువైన సాగునీటిని వృథా చేయకుండా ఆయకట్టు రైతులందరూ పొదుపుగా వాడుకుంటూ నీటి కుంటలు నింపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 80.5 టిఎంసిలు కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం కలిగి ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

పెన్షనర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను
సద్వినియోగం చేసుకోవాలి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో
- ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పలువురికి సన్మానం

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించి రిటైర్ అయిన వారు పెన్షనర్లకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల "పెన్షనర్ల దినోత్సవాన్ని" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలను తాను తప్పనిసరిగా అందించే ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే తమదృష్టికి తేవాలని, వెంటనే పరిష్కరిస్తానని వివరించారు. అలాగే పోతంగల్ మండలంలో వయో వృద్ధులకు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు విశ్రాంత భవనం కోసం భవనం మంజూరు చేస్తానని, ముందుగా దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. పెన్షన్‌లకు సంబంధించినది ఏదైనా సమస్య ఉంటే తాను పరిష్కరిస్తానని ఏటీఓ పుష్పలత తెలిపారు.



ఈవీఎల్ నారాయణను సన్మానిస్తున్న దృశ్యం

అనంతరం జిల్లా నాయకులైన ఈవీఎల్ నారాయణ, సిర్ప హనుమండ్లు, సిర్ప లింగంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ అంకు సంధ్య దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ సూదం మధన్ మోహన్, బోధన్ డివిజన్ అధ్యక్షులు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు పార్శి ప్రకాశం, కోశాధికారి సత్యానందం, నిజామాబాద్ జిల్లా వయోవృద్ధుల పెన్షనర్‌ల సంఘం అధ్యక్షులు అద్దంకి ఉశాన్, జిల్లా కోశాధికారి నారాయణ, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు సిర్ప హన్మాండ్లు, సర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

29న కృతజ్ఞతా సభకు తరలిరండి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృతజ్ఞతా సభ గోడ ప్రజల ఆవిష్కరణ జిల్లా అధ్యక్షులు జమీల్ చేతుల మీదుగా మంగళవారం నిర్వహించారు. 24 సంవత్సరాల తెలుగు, హిందీ, ఉర్దూ భాష పండితుల పదోన్నతుల కలను నెరవేర్చిన ప్రభుత్వానికి ఈనెల 29న కృతజ్ఞతా సభ న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉంటుందని తెలిపారు. ఈ సభకు తెలుగు, హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, అర్బన్, నిజామాబాద్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి, డిసిసి ప్రెసిడెంట్ మానాల మోహన్ రెడ్డి అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో . సలహాదారు గంగామోహన్ రాష్ట్ర కార్యదర్శి నగేష్ కుమార్, జిల్లా అదనం కార్యదర్శి శ్రీనివాస్ గారు, సురేష్, జగదీష్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, భాను ప్రకాష్, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని జెండాగల్లి జెంటిల్ కిడ్స్ పాఠశాలలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నానమ్మలు, తాతయ్యలు విచ్చేసి ఆట పోటీల్లో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలు అలరించాయి. ఈ పోటీలలో విజేతలుగా గెలిచిన వారికి సన్మానం నిర్వహించి బహుమతులు అందజేశారు.. గణిత దినోత్సవ పురస్కరించుకొని గణితానికి సంబంధించిన ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్ నగర్ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మాణిక్ బండారు గ్రామానికి చెందిన నీలం రాజు (26) మంగళవారం బోర్గం గ్రామ శివారులోని దాస్ నగర్-మాక్లూరు వెళ్లే రోడ్డుకు కుడివైపున ఉన్న నిజాంసాగర్ కెనాల్ పక్కన ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన వ్యక్తి 100 నెంబర్‌కు డయల్ ద్వారా పోలీస్ స్టేషన్లో సమాచారం ఇచ్చారన్నారు. ఘటన ప్రదేశానికి వెళ్లి మృతున్ని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య నీలం రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్టు తెలిపారు. మృతుడు కొద్ది రోజుల నుంచి తాగుడుకు అలవాటు పడి ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ ఉండేవాడు. ఇంట్లో బంగారం అమ్మే విషయంలో భార్య, తండ్రితో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్ళినాడన్నారు. బంగారం అమ్మడం కోసం భార్య మనస్థాపనతో ఉరివేసుకొని చనిపోయినట్లు తెలుస్తుందన్నారు. పోస్టుమార్టంకోసం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అప్పుల బాధతో ఉరేసుకుని ఆత్మహత్య

- మద్యానికి బానిసై

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి కావడంతో వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం ప్రాంతంలో గల రాజు గృహకల్ప క్వార్టర్స్ ప్రాంతంలో జీవనం సాగించే సాప భరత్ (28) ఎటువంటి పని చేయడు. కాగా మద్యానికి బాగా బానిస అవడం వల్ల అప్పుల పాలై, ఫైనాన్షియల్ ప్రాబ్లం వల్ల మద్యం మత్తులో క్షణికావేశంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికి సహకారం అందజేస్తా

- అభినందించిన ఎంపీడీవో అనంత రావు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

క్రీడా నైపుణ్యం తీయడానికి ఎల్లవేళలా క్రీడాకారులను ప్రోత్సహించడానికి తన వంతు సహాయ సహకారాలను అందజేస్తూ ఉంటానని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంతరావు అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ టోర్నమెంట్లో ఇందల్ వాయి మండల కబడ్డీ మహిళా జట్టు ప్రథమ స్థానం సాధించారు. కబడ్డీ పురుషుల జట్టు ద్వితీయ స్థానం సొంతం చేసుకోగా వాలీబాల్ పురుషుల జట్టు ద్వితీయ స్థానం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేయడంతో పాటు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కొందరు క్రీడాకారులు ఎదుర్కొంటున్న పరిస్థితులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంతరావు దృష్టికి తీసుకుని వచ్చారు. ఎంపీడీవో సైతం స్వతహాగా వాలీబాల్ క్రీడాకారుడైనందున రాష్ట్రస్థాయిలో ఎంపికైన వాలీబాల్ క్రీడాకారులకు వారి ప్రయాణ ఖర్చులకోసం రూ. 3వేల రూపాయల నగదును క్రీడాకారులకు అందజేశారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి మండలం పేరు ప్రఖ్యాతులు గావించే విధంగా కృషి చేయాలని సూచించారు. అంతకుముందు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు సురేష్, భూపతి ,రాజేశ్వర్, వి రాజ్ కుమార్, శృతి, సాయి రాధ, సునీత, సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదవ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఎనిమిదవ వార్డులో మంగళవారం ఇందిరమ్మ ఇంటింటి సర్వే కార్యక్రమం కమిషనర్ రాజు ఆదేశానుసారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ పి నాగరాజు, వార్డు ఆఫీసర్ నితిన్, బిల్ కలెక్టర్ రామ్, శంకర్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ



భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీసీ రోడ్, డ్రైనేజీ పనులు నాణ్యతతో, త్వరతగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను అధికారులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదేశించారు. 7వ డివిజన్ చంద్రనగర్‌లో, 17వ డివిజన్ గౌతమ్ నగర్‌లో, 35వ డివిజన్ హమాల్వాడీలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ధన్‌పాల్ మున్సిపల్ నగర మేయర్ నీతు కిరణ్‌తో పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనరల్ ఫండ్ ద్వారా ప్రతి డివిజన్‌కు పదిలక్షల రూపాయలు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా నగరంలో పలు డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులు నాణ్యతతో ఎటువంటి జాప్యం లేకుండా త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలనీ ఇంచార్జ్ మంత్రి జూపల్లి, ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు..

నగర అభివృద్ధికి 100 కోట్లు ప్రతేక నిధులు విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గెలిచి ఏడాది గడుస్తున్న ఎమ్మెల్యేగా తనకు రావలిసిన సొంత నిధులు కూడా రాలేదని అన్నారు. వెంటనే వాటిని కూడా విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుక్క మధు, మాయావర్ సవితచ ఎర్రం సుధీర్ పాల్గొన్నారు.

వస్తువుల కొనుగోళ్లలో నష్టపోతే
వినియోగదారులు నష్టపరిహారం పొందొచ్చు

- సీసీపీఏకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు
- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- జాతీయ వినియోగదారుల దినోత్సవం పోస్టర్ విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వస్తువుల కొనుగోళ్లలో నష్టపోతే వినియోగదారులు నష్టపరిహారం పొందొచ్చని గౌరవ అధ్యక్షులు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ప్రాంతంలో సివిల్ సప్లై అధికారుల సమక్షంలో జాతీయ వినియోగ దారుల దినోత్సవం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం "వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే నినాదం వినియోగదారులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చనుందని తెలిపారు. కల్తీలు ఇవన్నీ ఒక ఎత్తయితే మరో పక్క విద్య, వైద్యం, వ్యాపారంగా మారడం, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, చిట్ ఫండ్స్, రియల్ ఎస్టేట్ లాంటి కొన్ని సంస్థలు చేస్తున్న మోసాలకు వినియోగదారులు విపరీతంగా నష్టపోతున్నారని అన్నారు. తమకు జరిగిన కష్టనష్టాలకు జిల్లా వినియోగదారుల కమిషన్లు, రాష్ట్ర కమిషన్లు, జాతీయ కమిషన్లు, రాష్ట్రంలోని వినియోగదారుల సంఘాలు పనిచేస్తున్నప్పటికీ సత్వర న్యాయం వినియోగదారుడు పొందలేకపోతున్నాడని తెలిపారు. ఈతరుణంలో భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల శాఖ వినియోగదారుల సంఘాల కోరిక మేరకు వినియోగదారుల సౌలభ్యం కోసం 2019 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాని రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ చట్టం ద్వారా మనం ఎక్కడ వస్తువు కొన్న మన జిల్లాలో వినియోగదారుల కమిషన్‌లో కేసులు వేసుకొని నష్టపరిహారం పొందే అవకాశం కల్పించారన్నారు. మోసపూరిత ప్రకటనలు యాడ్ ఇచ్చేటువంటి సెలబ్రిటీలకు 50 లక్షల వరకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించనుందని తెలిపారు. కల్తీలు చేసిన వారికి కూడా జైలు శిక్షతోపాటు జరిమానా విధించే విధంగా ఆన్లైన్ కొనుగోలు చేసే వాళ్ళు కూడా నష్టం జరిగితే వినియోగదారుల కమిషన్లను ఆశ్రయించవచ్చని అన్నారు. భారత ప్రభుత్వం సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) ఏర్పాటు చేసిందని, తప్పుడు ప్రచారం మోసాలు చేసే పెద్ద పెద్ద కంపెనీల పైన కూడా సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీకి ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. కావున వినియోగదారులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు తమ ఇంటి వద్ద నుండే తమ మొబైల్ ఫోన్ల ద్వారా అంతర్జాలం ద్వారా ఫిర్యాదులు చేసుకునే వెసులుబాటు కల్పించిందని అన్నారు. "వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యం " అందుకు జాతీయస్థాయిలో కన్జ్యూమర్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారని, వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1915, 8800001915 ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం, ఏఎస్‌ఓ రవికుమార్ రాథోడ్, లీగల్ మెట్రాలజీ అధికారులు ఫుడ్ సేఫ్టీ అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇందూరు కన్జ్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్తకార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మండలి నుంచి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలి

- దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

మంత్రిమండలి నుండి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలని దేశ ప్రజలకు అమిత్షా క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ, పిసిసి ఆదేశాల మేరకు ఇటీవల పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటలకు నిరసనగా వెంటనే అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి కలెక్టర్ ద్వారా మెమోరాండం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయం నందు జాయింట్ కలెక్టర్‌కి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు అందరూ కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో 10 సంవత్సరాలుగా పాలిస్తున్న బిజెపి పార్టీ 10 సంవత్సరాలుగా రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనవాళ్లను తుడిపి వేయాలనే ఆలోచన చేస్తుందని అన్నారు. పార్లమెంటులో అమిత్‌షా మాట్లాడుతూ మాటిమాటికి అంబేద్కర్ అనడం కంటే దేవుని ప్రార్థిస్తే మంచిదని చెప్పడం దేశ ప్రజలందరూ ఖండిస్తున్నారని తెలిపారు. దేశ స్వాతంత్ర పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించి దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆనవాళ్లు తుడిచే ప్రయత్నం చేస్తున్న బిజెపికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ప్రధాని ముందే హోం మంత్రి అలా మాట్లాడితే మోడీ స్పందించకపోవడం చూస్తుంటే దీని వెనుక మోడీ కూడా ఉన్నారని భావిస్తున్నామని తెలిపారు. కావున వెంటనే అంబేద్కర్ గురించి తక్కువ చేసి మాట్లాడిన హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని, అమీత్ షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మానాల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతారెడ్డీ రాజారెడ్డి,మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా ఫిషర్ మన్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ యూత్ కాంగ్రెస్ పార్లమెంటు అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్, నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు సుభాష్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మొహీస్, జిల్లా కాంగ్రెస్ డెలిగేట్ ప్రమోద్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని ప్రజలందరికి డిసెంబర్ 25న జీసస్ క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగా సందర్భంగా పోలీస్ శాఖ తరఫున ప్రజలందరికీ నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ మంగళవారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సర కాలంలో ప్రజలందరు వారి కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషములతో కాలం గడపాలని సూచించారు. ఈర్ష్య, ద్వేషం, అసూయలతో కూడిన చీకట్లను పారద్రోలి ప్రేమ అనే దీపం వెలిగించి పది మందికి వెలుతురును ఇవ్వాలని అన్నారు. ఎల్లప్పుడు ప్రజలు పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా సోదర భావముతో మెలగాలని తెలిపారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని చౌట్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును ఆయన పరిశీలించారు. దరఖాస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేలో సమగ్రంగా పొందుపంచాలని సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి సూచించారు. ఇల్లు లేని పేదలను గుర్తించి పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు చోటు లేకుండా, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్థలం ఉండి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. సర్వేను పకడ్బందీగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పలువురు లబ్దిదారులతో ఎంపీడీవో మాట్లాడారు. కాగా సర్వే సందర్భంగా తరచు సర్వర్ ఇబ్బందులు తలెత్తడంతో సర్వే ఆలస్యమవుతుందని, ఈ విషయమై జిల్లా టెక్నీషియన్‌కు సమాచారాన్ని అందించి ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ జ్యోతి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సాదుల్లా, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తే ప్రజాగ్రహం తప్పదు

- వ్యవసాయ కూలీలకు శఠగోపం పెడుతున్న ప్రభుత్వాలు
- సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రజా ఆగ్రహం తప్పదని సిపిఐ(ఎంఎల్)మస్ లైన్ రాష్ట్ర సెక్రటరియట్ సభ్యులు వి.ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో సిపిఐ (ఎంఎల్) మస్ లైన్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వాహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ఓట్ల కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఒకవైపు రైతులను, మరోవైపు కూలీలను ధగా చేస్తున్నారన్నారు. వ్యవసాయ సాగుచట్టాలను రద్దు చేస్తామని చెప్పి తిరిగి అధికారంలోకి రాగానే విస్మరించారన్నారు. ఢిల్లీలో రైతంగా పోరాటానికి తలవంచి కనీస మద్దతు ధర చట్టం చేస్తాం అని మోడీ రాతపూర్వకంగా హామీ ఇచ్చి ఇప్పుడు అమలుకు మాత్రం పూనుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను తగ్గించి, కూలీల పొట్టకొడుతున్నారన్నారు. రాష్ట్రంలో జీవన భృతిని ఇవ్వడంలో మీనమేషాలు వేస్తున్నారని ఆరోపించారు. కేవలం 100 రోజులు పని చేసిన ఉపాధి కూలీలకే భృతి ఇస్తామనడం కూలీలను విస్మరించడమేనన్నారు. ఇప్పటికైనా రైతులు, కూలీల పట్ల కేంద్రం ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకుంటే పెద్దఎత్తున పోరాటాలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు సారా సురేష్, డివిజన్ ఆర్. రమేష్, మండల నాయకులు బి. కిషన్, జి. సత్తెవ్వ కే. రాజేశ్వర్, జి. కిషన్, ఎంఎం. నరేందర్, ఆర్. దామోదర్, ఈ. రమేష్, ఎండీ. అనిస్, జి. అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

టీయూలో ఇంటర్ కాలేజ్ ఖోఖో సెలక్షన్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ ఖో ఖో సెలెక్షన్స్-2024 యూనివర్శిటీ ప్లే గ్రౌండ్ లో ప్రారంభించామని తెలంగాణ యూనివర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డాక్టర్. జి. బాలకిషన్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా నుండి సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహించడానికి అనుమతులు ఇచ్చిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ టి. యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్. ఎం యాదగిరి రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసెలెక్షన్స్‌లో ప్రతిభ గల వారిని సెలక్షన్ చేసి తమిళనాడు సెంట్రల్ యూనిర్సిటీలో ఈ నెల 27నుంచి 31వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటి ఖోఖో మెన్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ డాక్టర్ బి ఆర్ నేత , ఫిజికల్ డైరెక్టర్స్ డా. బాలమని, అనిల్ కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థి రచన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

- పున్నశ్చరణ తరగతుల ముగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న పలువురు

విద్యార్థి వారి రచన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని, శక్తి సామర్థ్యాల మేరకు రాణించే విధంగా చూడాలని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం, భారతీయ భాషల సంస్థ మైసూర్ వారి సహకారంతో సంయుక్తంగా నిర్వహిస్తున్న అధ్యాపకుల ఒరియంటేషన్ తరగతుల్లో భాగంగా ఏడవ రోజు మధ్యాహ్నం ముగింపు సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ సూర్య ధనంజయ భారతీయ భాషల సంస్థ మైసూర్ ప్రిన్సిపాల్ రాకేష్ చేరుకోడు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి హాజరయ్యారు. మొదటి ప్రసంగకర్త ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వెంకటరామయ్య "ఈ తెలుగు" అనే అంశంపై ప్రసంగిస్తూ అంతర్జాలంలో తెలుగు బ్లాగుల్లో ఏ విధంగా రాయాలో ఉదాహరణలతో సహ వివిధ బ్లాగులను వివరించారు. విద్యార్థికి అందుబాటులో ఉంటుందని, ప్రతి విద్యార్థి దీన్ని వినియోగించుకొని వారి రచన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఆధారాలతో చూపించారు. రెండవ ప్రసంగకర్త ప్రొఫెసర్ ఎస్‌వి.సుబ్రమణ్య మాధవ శర్మ ప్రసంగిస్తూ గిరిజన భాషలపైన డాక్యుమెంటేషన్ గుర్తించిన దశలను అట్లాగే ఫొనెటిక్స్ మార్ఫాలజీ తదితర అంశాలపై సంక్షిప్తంగా వివరించారు. ఎరుకల భాషపై పరిశోధన చేసిన విధానాన్ని తెలిపారు. విద్యార్థులలో ఐపిఎ చార్ట్‌పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం వెనుక ఎనలేని కృషిచేసిన ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య మారుమూల ఉన్న తెలంగాణ యూనివర్సిటీ భారతీయ బాషా సంస్థ తరపున ఇక్కడ కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా సిఐఐఎల్ మైసూర్ వారిని ఒప్పించిన విధానాన్ని అధ్యాపకులకు మంచి అవకాశాన్ని కల్పించినందుకు ప్రిన్సిపల్ రాకేష్ చేరుకోడు, ఆచార్యలావణ్య, సిఐఎల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లును తెలుగు శాఖ అధ్యక్షులు లక్ష్మణ చక్రవర్తి అతిథులు అభినందించారు. ఇంతటి అవకాశాన్ని అధ్యాపకులకు అందించినందుకు తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖకు, లావణ్య అధ్యాపకుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వీరనారి చాకలి ఐలమ్మ వైస్ ఛాన్సలర్ సూర్య ధనంజయ మాట్లాడుతూ.. ఇంతటి గొప్ప ఓరియంటేషన్ ప్రోగ్రాం తెలంగాణ యూనివర్సిటీలో తెలుగు అధ్యయన శాఖ నిర్వహించడం అనేది గొప్ప విషయమని అన్నారు. అధ్యాపకులు నిరంతరం విద్యార్థులుగా ఉంటూ విద్యార్థుల్లో రచన నైపుణ్యాలను భాషా వికాసాన్ని పెంపొందించాలని, తద్వారా సమాజ శ్రేయస్సు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థి నేర్చుకోవడం వల్లనే సమాజం బాగుపడుతుందని అన్నారు. భారతీయ భాషల సంస్థ మైసూరు వారు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా అది తెలంగాణ యూనివర్సిటీలో పెట్టడం అభినందనీయమన్నారు.

పేదలకు ఆసరా.. సీఎం రిలీఫ్ ఫండ్

నవతెలంగాణ-వర్ని

ముఖ్యమంత్రి సహాయనిధి రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ఆసరాగా మారిందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడలోని తన నివాసంలో మోస్రా మండల కేంద్ర పరిధిలో గల గోవూర్, చింతకుంట, మోస్రా గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిట్ల శ్రీరాములు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ

నవతెలంగాణ-తాడ్వాయి

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. కుటుంబాల పూర్తి సమాచారం సేకరించి ఇంటి పన్ను చెల్లించిన రసీదులను యాప్‌ద్వారా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, కిషన్‌గౌడ్, గంగారాం తదితరులున్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు
- నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వాఖ్యలు సరికాదని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమిత్ షా కేంద్రమంత్రి కావడానికి రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యాలకు వెంటనే క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మత రాజకీయాలు తప్ప అభివృద్ధిపైన ఎప్పుడు కూడా దృష్టి పెట్టలేదన్నారు. అంబేద్కర్ ను అవమానిస్తే కాంగ్రెస్ పార్టీ సహించబోదన్నారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప వారిపై అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, మాజీ జెడ్పిసిలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, సామెల్, ఉషగౌడ్, తూర్పు రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో వికెవి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన నాటి నుంచి క్రైస్తవులకు చాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రతి యేటా ఇలా క్రిస్మస్ సంబరాలు ప్రభుత్వం తరపున నిర్వహించడం చాలా ఆనందదాయకం అన్నారు. క్రైస్తవ సోదరులు ఎమ్మెల్యేను పూలమాల, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటాడుతున్న ఏడుగురిపై కేసు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుళ్ల శివారులో పేకాటాడుతున్న ఏడుగురిపై జుక్కల్ పోలీసులు అకస్మాత్తుగా దాడులు చేసి వారిపై కేసులు నమోదు చేసినట్టు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం ప్రకారం పెద్దగుల్లా గ్రామంలోని శివారు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా పేకాటాడుతున్నట్టు సమాచారం అందిన వెంటనే జుక్కల్ పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించి ఏడుగురుని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు తెలిపారు. పేకాటాడుతున్న వారి వద్ద నుంచి రూ.57,110, మూడు బైకులు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం పరుచుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన నాయకులు



పరామర్శించిన నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ నర్సయ్య కూతురు శివాని (21) హైదరాబాద్‌లో ఆదివారం అర్ధరాత్రి సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబన్ని జనగామ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి మంగళవారం ఆయన గృహం వద్ద పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, నాయకులు ఇంద్రసేనా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు రవీందర్ రెడ్డి, బాపు రెడ్డి, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తాడ్వాయి

మాజీ జెడ్పిటిసి సుంకరి గంగాధర్ ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. గత కొంతకాలం అనారోగ్య కారణంగా పార్టీకి దూరంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీతో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులను చూసి తాను పార్టీ కింద పనిచేస్తానని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జుక్కుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బండారి సంజీవ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, మేకల రాజు, ఎంగ్రియాల్ మాజీ ఉపసర్పంచ్ సుధాకర్ రావు, దయాకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజ్‌విల్ నడిపితే క్రిమినల్ కేసులు నమోదు

- రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న



నవతెలంగాణ-రెంజల్

రోడ్లపై కేజ్‌విల్ నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న తెలిపారు. మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్లపై రైతులు పట్టీలు లేకుండా కేజ్‌విల్స్‌ను నడిపిస్తే రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల ప్రజల సౌకర్యార్థం కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు నిర్మిస్తే రైతులు తమ పంట పొలాలను సాగు చేసుకోవడానికి ఈ రోడ్లపై కేజీ పిల్లలు నడిపిస్తే రోడ్లు త్వరగా చెడిపోయే ప్రమాదం ఉందని, అత్యవసర సమయంలో కేజీ బిళ్ళకు పట్టీలను ఏర్పాటు చేసుకొని తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. రోడ్లపై కేజీలు నడిపించినట్లు తమ దృష్టికి వస్తే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్లాస్టిక్ వస్తువులే ఆధారం

- వాటిని పోగుచేసి అమ్మి బతుకుబండిని కొనసాగిస్తున్న వ్యక్తి



నవతెలంగాణ-రెంజల్

ప్లాస్టిక్ వస్తువులే వ్యక్తి జీవనానికి ఆధారమయ్యాయి. వాటిని పోగుచేసి అమ్మి బతుకుబండిని కొనసాగిస్తున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రకు చెందిన సునీల్ అనే యువకుడు మతిస్థిమితం కోల్పోయి మండలంలోని సాటాపూర్ గ్రామానికి వచ్చాడు. గత కొన్ని సంవత్సరాలుగా చౌరస్తాలో దొరికిన వస్తువులను ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో గోధుమ రొట్టెలను తెచ్చుకొని తన జీవనం గడుపుతున్నాడు. చౌరస్తాలో ఏ వస్తువు దొరికినా.. దానిని భద్రంగా దాచి విక్రయించగా వచ్చిన డబ్బుతో జీవనాన్ని గడుపుతున్నాడు. సాటాపూర్ సమీపంలోని మాజీ ఎంపీపీ మోబిన్ ఖాన్ కొనుగోలు చేసిన మహర్షి పాఠశాల మడిగలలో తలదాచుకుంటున్నాడు. ఆయన ఎవరితో మాట్లాడిన సైగల ద్వారా తెలుసుకోవాలి తప్ప మనకు సమాచారాన్ని రాబట్టడం కష్టతరం అవుతుంది. చౌరస్తాలో తిరుగుతూ ఉన్నప్పటికీ ఎవరినీ ఆశించకుండా తన పని తను చేసుకుంటూ, బతుకు బండిని నడిపిస్తున్నాడు.

ఆరు గ్యారెంటీలపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కళాబృందం

నవతెలంగాణ-సదాశివనగర్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీ పథకాలపై కళాబృందం సభ్యులు మంగళవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సబ్సిడీపై గ్యాస్ ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ రమేష్‌రావు, కళాకారులు సవిత, శిల్ప లత, దివ్య, ప్రశాంత్‌రెడ్డి, మహేందర్, రాము, విఠల్‌రెడ్డి, లక్ష్మినారాయణ, తిరుపతి కాశీరాం, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

గల్లీ నుంచి రాష్ట్ర రాజధాని వరకు ఉద్యమాన్ని విస్తరిస్తాం

- వీహెచ్‌ఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

నవతెలంగాణ-కామారెడ్డి

వికలాంగులకు ప్రకటించిన అన్ని పథకాలు, ఆసరా పింఛన్ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని గల్లీ నుంచి రాష్ట్ర రాజధాని వరకు విస్తరిస్తామని వీహెచ్‌పి జాతీయ అధ్యక్షురాలు సూజత సూర్యవంశీ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి ద్వారా హెచ్చరిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ వారం రోజుల్లో చేయూత ద్వారా పెంచిన పెన్షన్ ఇవ్వాలన్నారు. వికలాంగుల 2016 చట్టాన్ని అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్, జిల్లా కమిటీ సభ్యులు సాయిలు, సుజాత, లక్ష్మి, లక్ష్మణ్, రాజవ్వ, పృథ్వీరాజ్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న పలువురు

బహిరంగ క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని జుక్కల్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ అరవింద్ డిమాండ్ చేశారు. అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిథ్ షా అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానపర్చడం సరికాదని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అంబేద్కర్ పేరును అంతం చేయడానికి దిగి వచ్చిన ఆధునిక మనువే ఈ అమిత్‌షా అన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగానికి మొదటి విలన్ బీజేపీ ఐతే, రెండవ విలన్ అగ్ర వర్ణ, ఆధిపత్యంలోనున్న ప్రతి పార్టీ, ప్రతి సంస్థ అంబేద్కర్‌కు, భారత రాజ్యాంగానికి బద్ద శత్రువులని ప్రకటిస్తున్నామన్నారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అంబేద్కర్ పేరును అవమానిస్తూ పార్లమెంట్‌లో మాట్లాడడం భారత జాతి మొత్తాన్ని అవమానించడమేనని అన్నారు.



నిరసనలో పాల్గొన్న పలువురు

క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాలి

- బెతానియా ఫిలోసఫీ ఎడపల్లి చర్చ్ పాస్టర్ తిమోతిరాజ్

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోనున్న బెతానియా ఫెలోషిప్ చర్చిలో బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా వేడుకలను నిర్వహించనున్నట్టు పాస్టర్ తిమోతి రాజ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ బోధన్ డైరెక్టర్, ఎడపల్లి వాసి బొబ్బిలి శ్రీనివాస్, జనగాం మోహన్ రెడ్డి, శంకర్‌గౌడ్, ఎల్లయ్య యాదవ్, ఆకుల శ్రీనివాస్, తదితరులను కలిసి ఆహ్వానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అజయ్, మనోహర్, రవి తదితరులున్నారు.



మాట్లాడుతున్న పాస్టర్ తిమోతిరాజ్

తాడ్వాయి : క్రిస్టమస్ వేడుకలకు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు హాజరు కావాలని సిఎస్ఐ చర్చి పాస్టర్ టి.రవీందర్ మంగళవారం తెలిపారు. ఈ వేడుకలు ఉదయం నుంచి ప్రార్థనతో ప్రారంభమవుతాయని అనంతరం కేక్ కట్ చేసి ప్రార్థన పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రెంజల్ : మండలంలో క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని వీరన్నగుట్ట, బాగేపల్లి, నీలా క్యాంప్, దూపల్లి, తాడ్‌బిలోలి గ్రామాలలోనున్న మందిరాలకు ముస్తాబు చేశారు. బుధవారం చర్చిలలో సామూహిక ప్రార్థనలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 17 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని భారతీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ అధ్యక్షులు కస్ప లింగం మాట్లాడుతూ.. విద్యాశాఖ సమగ్ర శిక్షలో అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సుమారు 18 సంవత్సరాల నుంచి 19,600 మందికి పైగా ఉద్యోగులు పాఠశాలల అభివృద్ధికి కోసం పని చేస్తున్నారని కావున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాష్, అక్షయ్, గణేష్, ఉదయ్, కిరణ్, వికాస్, ఉదయ్, సిద్దు, శివ, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బైక్ ర్యాలీ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-పిట్లం

జుక్కల్ నియోజకవర్గ స్థాయిలో 29న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే బైక్ ర్యాలీ కరపత్రాలను స్థానిక నీటిపారుదల విశ్రాంతి గృహం ఆవరణలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రూశేగం భూమయ్య మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కుల ఏబిసిడి వర్గీకరణ సాధనకై నిర్వహించే బైక్ ర్యాలీని ఆయా గ్రామాల దండోరా కుటుంబీకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు మహిపాల్, జంగం లక్ష్మణ్, బుర్రెమ్ బాలరాజ్, ఇమ్మానుయేలు, జంగం బాలు, ఎన్నిగె హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

శుభకార్యానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సోమూరు మాజీ సర్పంచ్ గంగాబాయి కాశీనాథ్ పటేల్ కుటుంబంలో జరిగిన పెండ్లి శుభ కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే హాజరయ్యారు. మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నాయకులతో మాట్లాడుతూ.. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించిన దేనికైనా వస్తా పార్టీ పరంగా నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో మద్నూర్ ఉమ్మడి మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు గఫర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బన్సీ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి వై.గోవింద్ నాయకులు పాల్గొన్నారు.



పెండ్లి శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే

కొడిచర్ల పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఎంపిపిఎస్ (ఇంగ్లీష్ మీడియం) పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎంఈఓ శంకర్, సుగుణకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, హాజరయ్యారు.



జానపద కళాకారులకు రవీంద్ర భారతిలో సన్మానం



జానపద కళాకారులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్మాన కార్యక్రమం సోమవారం రాత్రి ఏర్పాటు చేసింది. జానపద కళా రంగంలో చురుకుగా పాల్గొంటూ తోటి కళాకారులకు అండగా ఉంటూ పలు ప్రదర్శనలు నిర్వహించినందుకు గాను జిల్లా అధ్యక్షులు, లింగంపేట్ వాసి ఉప్పుల విశ్వనాథం దంపతులకు సన్మానించారు. అదేవిధంగా రాష్ట్ర కార్యదర్శి రెడ్డిరాజన్న, జిల్లా కార్యదర్శి ఆనంద్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో కవి, రచయిత, గాయకుడు గద్దర్ కుమార్తె, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ వెన్నెల, అలేఖ్య, పుంజాల సంగీత, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు వంగ శ్రీనివాసగౌడ్, కార్యదర్శి చెంచు లింగన్న తోటి కళాకారులందరూ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ అలయంలో విగ్రహ పున్నప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతుని విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మద్నూర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మద్నూర్, బిచ్కుంద, కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కే.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిచ్కుంద డిగ్రీ కళాశాలలో ఆంగ్లం-1, అర్థశాస్త్రం-1 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. మద్నూర్ డిగ్రీ కళాశాలలో తెలుగు-1, ఆంగ్లం-1, బాటని-1, జువాలజీ-1, కెమిస్ట్రీ-1 ఖాళీలున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు అర్హత కలిగి ఉండాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్హత పత్రాలు ఈనెల 27న మధ్యాహ్నం మూడు గంటలలోపు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

కాంగ్రెస్ పార్టీలోకి మాజీ సర్పంచ్ అనూష పర్వతరావు ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు సమక్షంలో సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు ఇమామ్, నరసింహారెడ్డి, చంటి, గులామ్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గోపాల్‌పేట్‌లో మహా పడిపూజ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో గల వేణుగోపాలస్వామి ఆలయంలో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తున్నట్టు అయ్యప్ప సేవా సమితి గోపాల్పేట్ గ్రామస్తులు మంగళవారం తెలిపారు. శ్రీ చంద్రం గురు సామి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహిస్తున్నట్టు సూచించారు.

నేడు దేవత విగ్రహాల ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని గన్నారం(లింగాపూర్) గ్రామంలో పెద్దపోచమ్మ, భారడి పోచమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు మాజీ సర్పంచ్ దేగం హన్మంతు తెలిపారు. ఆలయాల ప్రారంభోత్సవానికి డాక్టర్ బసవలింగ అవధూత మహారాజ్ హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

నాటు వేయడంపై విద్యార్థులకు అవగాహన

- సెయింట్ జేవియర్స్‌లో జాతీయ రైతు దినోత్సవం



వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతులే దేశానికి వెన్నుముక, మన దేశం వ్యవసాయ ఆధారిత దేశం, రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సస్యశ్యామలంగా ఉంటుందని పాఠశాల చైర్మన్ పాకాల నరసింహా రావు, ప్రిన్సిపల్ లతా గౌడ్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక సెయింట్ జేవియర్స్ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ రైతు కుటుంబంతో పాటు విద్యార్థులు పొలంలో వరి నాటు వేయించామని అన్నారు. విద్యార్థులకు రైతు పడే కష్టం తెలియజేయడంతోపాటు వరినారు పెరిగి పొలం ఎలా ఏర్పడుతుందో తద్వారా వడ్లు ఎలా వస్తాయో పూర్తి అవగాహన కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గురించి రాజ్యసభలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మ దహనం అనంతరం కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడినుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ ఇలియాస్, పట్టణాధ్యక్షుడు పండ్ల రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీక్ష ఎవరి ప్రయోజనాల కోసం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-కాసిపేట

మాజీ ఎమ్మెల్సీ, ఓరియంట్ లోకల్ యూనియన్ అధ్యక్షులు ఎస్.రాములు నాయక్ మంగళవారం దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద చేపట్టిన 24 గంటల దీక్షకు సీపీఐ(ఎం) పూర్తి మద్దతు తెలియజేస్తుందని, కానీ ఈ దీక్ష ఎవరి ప్రయోజనం కోసమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు నుంచి ఈ రోజు వరకు యాజమాన్యం ఇచ్చిన హామీలు ఎందుకు అమలు జరగలేదో, దీనికి కారణం ఎవరో రాములు నాయక్ స్పష్టం చేయాలని కోరారు. ఓరియంట్ కంపెనీ నేడు బిర్లా యాజమాన్యం నుంచి అదానీ కంపెనీగా మారబోతోందంటే గత బీఆర్ఎస్, ప్రస్తుత బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వాల అనుమతి లేకుండానే ఈ తతంగం జరుగుతుందా అని పేర్కొన్నారు. వీటిపై కాసిపేట మండల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన కనీస బాధ్యత బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల నాయకులకు ఉందని తెలిపారు. లేదంటే కొంగ జపం, మొసలి కన్నీరు దీక్షలాగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని రత్నాపూర్ కాండ్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 2007-08 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో విద్యార్థులు పాల్గొని, ఉత్సాహంగా గడిపారు. 16 ఏండ్ల కింద పాఠశాలలో చదువు ముగించుకుని, వివిధ వృత్తులలో స్థిరపడిన విద్యార్థులు ఒకే చోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి గురువులను ఘనంగా సన్మానించుకున్నారు.

యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీలు రద్దు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో గతంలో వేసిన యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీలు రద్దు చేస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నూతన కమిటీలు వేసే వరకు ఎవరు కూడా యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులుగా చెప్పుకోకూడదని వివరించారు.

టీఆర్ఎస్ఎంఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ టీఆర్ఎస్ఎంఏ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని రిసోనెన్స్ వరల్డ్ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో నూతన ఆదిలాబాద్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.ప్రమోద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా గణేష్, టి.దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, శ్యామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ రాథోడ్, సంయుక్త కార్యదర్శిగా కార్తీక్, జీవన్‌రెడ్డి, సదాశివరెడ్డి, కోశాధికారి శుద్దోధన్ ఎన్నికయ్యారు. వీరిని పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి మనసు కరిగేలా చూడమ్మా..

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యాశాఖ - సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో చేస్తున్న సమ్మెలో భాగంగా 18వ రోజు వినూత్నంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనసు కరిగేలా అమ్మవారు చూడాలని పోచమ్మకు సమగ్ర శిక్ష ఉద్యోగులు బోనాలు సమర్పించారు. సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగినులు కొత్త కుండల్లో సాంప్రదాయ పద్ధతిలో బోనం ఎత్తుకున్నారు. తోటి పురుష ఉద్యోగుల డప్పులు కొడుతూ బోనాల నృత్యాలతో తమ డిమాండ్ల సాధనకు దీక్షా స్థలి నుండి పోచమ్మ గల్లిలో గల పోచమ్మ గుడి వరకు ఉత్సవం తలపించేలా వెళ్లారు. పెరుగు నైవేద్యం, చీర, పూలు అమ్మవారి విగ్రహం ఎదుట సమర్పించి బోనాలు వేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు కరిగి మా డిమాండ్లు అమలయ్యేలా చూడమ్మ అని వేడుకున్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, భూపేందర్ మాట్లాడుతూ.. ప్రధాన డిమాండ్ అయినా రెగ్యులరైజేషన్ చేయాలని లేని పక్షంలో



బోనాలతో వెళ్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కోశాధికారి ప్రసాద్ మహిళా అధ్యక్షురాలు గంగామని నాయకులు రాజు, విద్యాసాగర్, రవి, కిరణ్, పుష్ప, పవిత్రన్, స్వర్ణకుమారి, గంగాధర్, అఫ్సర్, రాణి, సుప్రజా, నగేష్ గౌడ్, రాజన్న, ప్రకాష్, మోహన్ రమేష్ నవీన్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్స్, సమస్యల పరిష్కారం కోసం 15 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల, ఉపాధ్యాయులందరి డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలు నిరవధిక సమ్మె శిభిరంలో విడుదల చేసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు వారు కోరుతున్నవి గొంతెమ్మ కోరికలు కాదని, సీఎం రేవంత్ రెడ్డి హామీల అమలు మాత్రమే ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. సమస్య పరిష్కరించకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని వెంటనే వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తూ సమ్మెకు తెర దించాలని వారు డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి..

ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి నిరవధిక సమ్మెను వెంటనే విరమింపచేయాలని నిజామాబాద్ కలెక్టర్ పరిపాలన అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి అరవింద్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు రాజు, విజయ్, ఉపేందర్, గంగమణి, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.





మరువొద్దు మహనీయులను

- విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రహరీపై చిత్రాలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ గోడకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు మహనీయుల చిత్రాలను గీయించారు. అందివచ్చిన టెక్నాలజీతో రానురానూ విద్యార్థులు సెల్‌ఫోన్లకే పరిమితమవుతున్న ఈ తరుణంలో విద్యార్థులు రాను రాను మహనీయులను మరిచిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల ఆవరణలోని ప్రహరీకి మహనీయుల చిత్రాలను గీయించి చిత్రాల కింద పేర్లు రాయించారు. పాఠశాల ప్రహరీపై గీయించిన అంబేద్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, భగత్‌సింగ్ తదితరుల మహనీయుల చిత్రాలు పాఠశాలకు వెళ్లిన విద్యార్థులతో పాటు.. అటు వైపు వెళ్లిన ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

చెరుకు సాగుపై రైతుల సమాలోచనలు

నవతెలంగాణ-బోధన్

చెరుకు సాగుకోసం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం హున్సా గ్రామంలో రైతులు చెరుకు పంట సాగుకోసం చర్చించారు. హున్సా, మంధర్నా, ఖాజాపూర్ గ్రామాల రైతులు పాల్గొని చెరుకు సాగు సాధ్యాసాధ్యాలపై అభిప్రాయాలు వెలిబుచ్చారు. ప్రభుత్వం బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పున:ప్రారంభించడానికి ప్రయత్నించడానికి కార్యాచరణ చేపట్టడంతో రైతులు ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పిసిసి డెలిగేట్ గంగాశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.నరేందర్‌రెడ్డి, బోధన్, సాలూర కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నాగేశ్వరరావు, సొసైటీ చైర్మెన్ మంధర్నా రవి, ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శీను, ఏఎంసి వైస్ చైర్మన్ శీల శంకర్, సాలురా సొసైటీ చైర్మన్ అల్లే జనార్ధన్, అల్లే రమేష్ రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

మున్సిపల్ కార్మికుడికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పదివేల ఆర్థిక సాయం అందజేసి కుటుంబాన్ని ఓదార్చారు. కామారెడ్డి పరిధిలోని రంగంపేటకు చెందిన మున్సిపల్ కార్మికుడు మున్సిపల్‌లో విధులు నిర్వహించుకుని ఇంటికి వెళ్తుండగా ఆక్సిడెంట్ కావడం వల్ల చనిపోవడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. చావు ఖర్చుల నిమిత్తం 10వేలరూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్సై నగేష్, యూనియన్ లీడర్ ప్రభు, రాజనర్సు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

తొక్కిసలాటలో గాయపడిన

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్‌లో సంధ్య థియేటర్ వద్ద పుష్ప చిత్రం ప్రీమియర్ షో వద్ద హీరో అల్లు అర్జున్ రావడంతో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీ తేజ్‌ను వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు వ్యక్తిగతంగా సినిమాలు అంటే ఇష్టం అని, కానీ ఇటీవల సినిమాలు సరైన విధంగా లేకపోవడంతో యువతకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, పుష్ప సినిమా రిలీజ్ ముందే చెప్పానని అన్నారు. ఇది కేవలం కల్పితమని పేపర్ ప్రకటన ఇవ్వాలని కోరానని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ దుర్ఘటన జరిగిందని, శ్రీతేజ్ కోలుకుంటున్నాడు అని పూర్తి ఆరోగ్యంతో ఉంటాడు అని అన్నారు. కుటుంబానికి అన్ని విధాలుగా అల్లు అర్జున్ అండగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు.



దేశంలో దళితులపై పెరుగుతున్న దాడులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

దేశంలో దళితులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, పార్లమెంట్ లో కేంద్ర హెూం శాఖ మంత్రి పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని తక్షణమే అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి చిన్న రెడ్డి డిమాండ్ చేశారు మంగళవారం మండలంలోని చేపూర్ గ్రామములో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే మతోన్మాద బీజేపీ శక్తులు అధికారంలోకి వచ్చాక దేశంలో దళితులపై దాడులు ఒకపక్క పెరిగిపోతుంటే కట్టడి చేయాల్సిన అమిత్ షా తన బాధ్యత మరిచి ఇలా చౌకబారుగా మాట్లాడ్డం సరైన పద్ధతి కాదని, రాజ్యాంగ విలువలు తెలియని హామీత్ షా లాంటివారిని పార్లమెంటు కూ పంపడం దురదృష్టకరమని అన్నారు. రాజ్యాంగం రచించిన గొప్ప మేధావి అంబేద్కర్‌ను అవమానపరిచి అమిత్ షా కూ కేంద్ర మంత్రి హెూదాలో కొనసాగే హక్కు లేదని, మోడీ అమిత్‌షా వాఖ్యలపై స్పందించాలని, రాజ్యాంగపై ప్రమాణాలు చేసి పార్లమెంట్ కూ వెళ్లిన అమిత్ షా తక్షణమే రజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. తెలంగాణా రాష్ట్రంలో ఒంటికాలిపై కయ్యానికి కాలు దువ్వె బీజేపీ ఎంపీలు రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను అవమానిస్తే ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీలు జన్నేపల్లి గంగాధర్, ఎల్క రంజిత్, సోక్కం సంజీవ్. సాయన్న ఉపాధ్యక్షులు చిట్యాల పోశెట్టి, క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షుడు కంపదండి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వాఖ్యలు సరికాదు : బిఎస్పి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాకేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర హెూమ్ మినిస్టర్ అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టినట్టు డిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి, అమిత్‌షాకు వ్యతిరేకంగా నినా దాలు చేసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి బిఎస్పి నాయకులు నీరడి ఈశ్వర్ న్యాయవాది, ఉపాధ్యక్షులు రాజేందర్, జుక్కల్ నియోజకవర్గం అధ్యక్షులు రోహిదాస్, కామారెడ్డి అసెంబ్లీ ఉపాధ్యక్షులు నత్తి జీవన్ బాన్సువాడ బిట్స్ ఇంచార్జ్ బండారి చరణ్, కామారెడ్డి మండల అధ్యక్షులు కోటగిరి మండల అధ్యక్షుడు ఇందూరు సాయిలు, పోతంగల్ ఉపాధ్యక్షులు దశరథ్, పిట్లం మండల ప్రధాన కార్యదర్శి రాములు, రుద్రూర్ టౌన్ నుండి గైన సాయిలు, శ్రీకాంత్, ప్రశాంత్, మారుతి జిల్లాలోని వివిధ అసెంబ్లీ మండలాల నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్‌లో లయన్స్‌క్లబ్ భవనంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కంటి వైద్యురాలు డాక్టర్ ప్రవల్లిక వైద్య పరీక్షలు నిర్వహించారు. మోతి బిందు ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి మంగళవారం కిసాన్‌నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం తెలిపారు. కార్యక్రమంలో దినేష్ భాయ్ పటేల్, వంశీ రెడ్డి, ప్రసాద్, బోజా రామ్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించినట్టు ఎస్సై తెలిపారు. కట్ట నరేందర్ (40) మద్యం తాగి పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ నందు హాజరు పరిచారు. రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ నరేందర్‌కు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్టు తెలిపారు.మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా షేక్ అశ్రాఫ్ (22) మద్యం తాగి పట్టుపడగా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వ్యక్తిని కోర్టులో హాజరు పరచగా షేక్ అస్రాఫ్‌కి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఫారెస్ట్ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు
- బాసర్ సర్కిల్ సిసిఎఫ్ శర్వానన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


సాసర్‌పీట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వన్యప్రాణులకు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగ కుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, ఫారెస్ట్ భూములను కబ్జా చేసిన, వన్యప్రాణులను వేటాడిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాసర్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానన్ పేర్కొన్నారు మంగళ వారం ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అమ్రాన్‌పల్లి, ధర్పల్లి సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలోని నాలుగు కిలోమీటర్ల మేర ట్రాకింగ్‌ను నిజామాబాద్ డిఎఫ్ఓ వికాస్, ఎఫ్డిఓ సుధాకర్‌రావు, ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్‌లతో కలిసి పరిశీలించారు. రేంజ్ పరిధిలో సాసర్ ఫీట్లు తదితర వివరాలను రేంజ్ అధికారి రవి మోహన్ భట్‌ను అటవీ ప్రాంతానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతంలో సోలార్ సిస్టం ద్వారా వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, గత ఏడాది పాటు నా మొక్కల వివరాలు సాగర్ ఫీట్లు, చెక్ డ్యాములు తదితర వాటి వివరాలను తెలుసుకున్నారు. అటవీ సంరక్షణకు ప్రజలు సహకారం అందజేస్తూ ఉండాలని, బీడీ ఆకుల కోసం కావాలని అటవీ ప్రాంతాన్ని తగలబెట్టవద్దని, దానికోసం ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇతర వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట డిప్యూటీ రేంజ్ అధికారి తుకారం రాథోడ్, సెక్షన్ అధికారులు అతిఖ్ అహ్మద్, సెక్షన్, బీట్ అధికారులు ఉన్నారు.

విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పెర్కిట్‌లో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, ప్లే గ్రౌండ్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పర్యవేక్షణ అధికారిణి ఎక్కడ ఉన్నారని కలెక్టర్ ప్రశ్నించగా.. సమ్మెలో పాల్గొంటున్నారని డ్యూటీ టీచర్ తెలిపారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ ఉడకబెట్టిన కోడిగుడ్డు అందిస్తున్నారా.. అని ఆరా తీశారు. పాఠశాల నిర్వహణను పక్కాగా పర్యవేక్షించి విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సరుకులను స్టీల్ డబ్బాలలో నిల్వ ఉంచి, తప్పనిసరిగా వాటికి మూతలు బిగించాలన్నారు. కూరగాయలు, ఇతర సరుకులను నేలపై ఉంచకూడదని హితవు పలికారు. విజయ కంపెనీ వంటనూనె, విజయ డైరీ పాలను వినియోగించాలని సూచించారు. నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నాన్ డిటెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

- యుఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా నాన్ డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయడాన్ని యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంగా వ్యతిరేకిస్తున్నామని జిల్లా ఉపాధ్యక్షులు పోషమైన మహేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన జాతీయ విద్యా విధానం పూర్తిగా ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు. నాన్ డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయడం వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఇందులో ఒకవేళ ఐదవ తరగతి, 8వ తరగతి పరీక్షల్లో ఫెయిలవుతే రెండు నెలల వ్యవధిలో మళ్లీ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని తెలియజేసినప్పటికీ, ఇప్పటికే చాలా ప్రాంతాల్లో విద్యార్థులు పరీక్షల భయంతో పాఠశాలకు వెళ్లకుండా ఇతర పనులకు వెళ్తున్నారని తెలిపారు. ఇప్పుడు నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయడం వల్ల చదువుకు దూరమయ్యే ఈ విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందా అని ప్రశ్నించారు. మారుతున్న కాలానుగుణంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం నాన్ డిటెన్షన్ విధానాన్ని మాత్రమే కొనసాగిస్తామని తీర్మానం చేయాలని కోరారు.

ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలి

- ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ టి.భాను ప్రకాష్

నవతెలంగాణ-బాల్కొండ

ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ టి.భాను ప్రకాష్ అన్నారు. యాసంగి పంటకు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ లక్ష్మీ ప్రధాన కాలువ ద్వారా నేడు ఉదయం 10:30 గంటలకు నీటి విడుదల ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటిని వృథా చేయకుండా ఆయకట్టు రైతులందరూ పొదుపుగా వాడుకోవాలని పేర్కొన్నారు.

పట్టణంలో దోపిడీ దొంగల హల్చల్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ విష్ణు అపార్ట్మెంట్‌లో సోమవారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు హల్చల్ చేశారు. ముఖానికి మాస్కులు ధరించి అపార్ట్మెంట్ చుట్టూ పరిసర ప్రాంతాలలో రెక్కీ నిర్వహించిన దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి. గత కొద్ది నెలల నుంచి దోపిడి దొంగలు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో సైతం దొంగతనాలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్ ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ తేదీ పొడగింపు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ అడ్మిషన్, రిజిస్ట్రేషన్ తేదీని ఈనెల 30 వరకు పొడిగించారు. భీంగల్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ప్రవేశాల కోసం వెంటనే స్థానిక జడ్పిహెచ్ఎస్ భీంగల్ పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక మండల విద్యశాఖాధికారి, స్థానిక గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఓపెన్ స్కూల్ కో ఆర్డి నేటర్ స్వామి కోరారు. మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు 10వ తరగతిలో ప్రవేశం పొందటానికి 14 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం 15 సంవత్సరాలు నించి ఉండాలన్నారు. విద్యార్థులు ఓపెన్ స్కూల్ ప్రవేశాల కోసం క్రింది ఫోన్ 9491534015, 9948082804 సంప్రదించాలని ఆయన కోరారు.

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

- తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న

నవతెలంగాణ-బాల్కొండ

బీడీ కార్మికులందరికి ఆంక్షలు లేకుండా రూ.4016 జీవనభృతిని ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీడీ వర్కర్ సీనియన్ ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి మండల ప్రజాపరిషత్, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7లక్షల మంది, జిల్లాల వ్యాప్తంగా 3లక్షల మంది బీడీ కార్మికులు బీడీ పరిశ్రమలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. వీరిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వంకి ఉందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మట్టి బ్యాగులను సిద్ధం చేయాలి : ఎంపీడీఓ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మట్టిబ్యాగులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మొక్కల పెంపకానికి లక్ష్యం మేరకు మట్టి బ్యాగులను సిద్ధం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి చింత రాజా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని హాసకొత్తూర్, చౌట్‌పల్లి గ్రామాల్లో నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నాటేందుకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీలో మట్టి బ్యాగులను, మొక్కలను సిద్ధం చేయాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సయ్య శాంతి కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

టూర్‌లో సందడి చేసిన శ్రీ సూర్యోదయ హైస్కూల్ విద్యార్థులు


విహార యాత్రలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నందిపేట్

విజ్ఞాన విహార యాత్రలో నందిపేటలోని శ్రీ సూర్యోదయ హైస్కూల్ విద్యార్థులు సందడి చేసినట్టు స్కూల్ కరెస్పాండెంట్ నాగారావు తెలిపారు. మంగళవారం స్కూల్లోని ఒకటవ రెండవ మూడవ తరగతి విద్యార్థులను ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిమ్మాపూర్‌లో గల ఇందూర్ తిరుమల, నెమ్లి, సారంగాపూర్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందులో సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్టు చెప్పారు.కార్యక్రమంలో హెడ్మాస్టర్ సురేష్, ఇన్చార్జి శిరీష, ఉపాధ్యాయులు సృజన, స్రవంతి, విజయ, రమ్య, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగానే మద్యపానం

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



నవతెలంగాణ-మోపాల్

మండలకేంద్రంలోగల ఓ వైన్స్‌లో తన పరిధి దాటి మందు సిట్టింగ్ ఏర్పాటు చేస్తునానరు. ఒక పర్మిట్ రూమ్‌కి ఉండాల్సిన నిబంధనలు దాటి బహిరంగంగానే మద్యపానం తాగుతున్న ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కనీసం పర్మిట్ రూమ్‌కు ఎంత నిబంధనలు ఉండాలని దానికి అటు ఇటు కాకుండా దాదాపు ఒక 300 గజాల పైబడి కాళీ స్థలంలో వైన్స్ యజమాన్యం సిట్టింగ్ ఏర్పాటుచేసి మందు అమ్మకాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారుల దృష్టికి నవతెలంగాణ తీసుకెళ్లిన దానిని కట్టడి చేయడం లేదు. దీని వెనకాల ఏం జరుగుతుందో మరి, వైన్స్ యాజమానుల కొరకు ఎక్సైజ్ అధికారులు పని చేస్తున్నారా.. లేక ప్రభుత్వానికి లోబడి పని చేస్తున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కంట్రోల్ చేయకపోతే లా అండ్ ఆర్డర్ కూడా ఇబ్బంది ఏర్పడుతుంది.

చలికాలం వ్యాధుల పట్ల జాగ్రత్త

- సుఖీభవ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వి జగత్ రాజ్



నవతెలంగాణ-నందిపేట్

చలికాలం వాతావరణం మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కావున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సుఖీభవ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వి.జగత్‌రాజ్ సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధుల పట్ల ప్రత్యేకంగా కేర్ తీసుకోవాలని సూచించారు. మంగళవారం నవ తెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. చలికాలం ముఖ్యంగా పిల్లలను దుమ్ములో ఆడుకోనివ్వద్దని రాత్రివేళ ప్రయాణాలకు దూరంగా ఉంచాలని సూచించారు. దగ్గు, దమ్ము ఉన్నవారు దుమ్ము ప్రదేశాలకు దూరంగా ఉండాలని చలి తీవ్రత నేపథ్యంలో బయటకు వెళ్ళినప్పుడు విధిగా మాస్కు ధరించాలని వెల్లడించారు. దగ్గు, దమ్ము, జ్వరం తీవ్రత అధికంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. గోరువెచ్చని నీటిని తాగాలని తెలిపారు. నందిపేట్ లో గల తమ సుఖీభవ ఆసుపత్రిలో ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచితంగా ఓపి చూస్తున్నట్టు తెలిపారు అదేవిధంగా ప్రతి గురువారం ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు ఉచితంగా డయాబెటిస్ టెస్టులు చేస్తున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ పాలన.. పేనుకు పెత్తనం ఇచ్చినట్టుంది

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కాంగ్రెస్ పాలన ఎట్లుందంటే పేనుకు పెత్తనం ఇస్తే తలంత కొరిగినట్లుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం 1200 మంది ఆత్మబలిదానాలతో, నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఏర్పడిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలకు అవి దూరం అయ్యాయని ఆపార్టీని బొంద పెట్టి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే కాంగ్రెస్ కూడా అదే తోవలో నడుస్తుందన్నారు. అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు వినిపించాలనుకుంటే సమయం ఇవ్వకుండా సభ సమయాన్ని వృధా చేసి, అనవసర విషయాలపైన చర్చ పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీ సమావేశాలు అంటేనే రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే శాసనాలు రూపొందించడం, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, ప్రజలకు ఏమి అవసరం ఉన్నాయో వాటిని చర్చించడం లాంటివి లేవని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకరిపైన ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికే అసెంబ్లీ నిర్వహించినట్లు ఉందన్నారు. సభా సమయాన్ని వృధా చేసి పది రోజులు నడపకుండా, నియోజకవర్గం సమస్యలు వినకుండా ఎమ్మెల్యేల ఆవేదన పట్టించుకోకుండా సభను ముగించడం అంటే యావత్ తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసినట్లే అన్నారు. తెలంగాణ ప్రజలు ఆరు గ్యారంటీలు 420 హామీలు చూసి ఓటేసి గెలిపిస్తే సంవత్సరం గడుస్తున్న ఒక్కటి దిక్కు లేదన్నారు. ప్రజా సమస్యలు, నియోజకవర్గ సమస్యల పైన అసెంబ్లీలో మాట్లాడుదాం అంటే మైక్ ఇవ్వరని, సభను ఆరు రోజులైన సరిగా నడపలేదని అన్నారు. లక్షల కోట్లు అప్పు తెచ్చి యావత్ తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిన బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజల ఉసురు తప్పక తగులుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో కూడా అవే నిర్బంధాలు, అరెస్టులు కొనసాగుతున్నాయని, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులను, ఇండస్ట్రీ వాళ్ళను కూడా అరెస్ట్ చేసిందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు, రైతుల ఆత్మహత్యలు జరుతున్నాయని, అడ్మినిస్ట్రేషన్ అస్తవ్యస్తం అయ్యిందని ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు.

కేటీఆర్ అరెస్ట్ ఓ డ్రామా, హైడ్రా ఓ డ్రామా, మూసి ఒక పెద్ద కుంభకోణం, విజయోత్సవాల పేరుతో ప్రజాధనం వృధా చేసి ప్రజలను మభ్యపెట్టామని అనుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తారా.. రాజీనామా చేస్తారో తెలంగాణ ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. ముఖ్యమంత్రి అల్లు అర్జున్‌పై అర్ధ గంట చర్చ పెట్టి మాట్లాడే సమయం ఉంది కాని గురుకులాల్లో విద్యార్థులు కల్తీ ఆహారంతో చనిపోతే, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే నోరు మెదపరని, చర్చ పెట్టరని, హైడ్రా బాధితురాలు బుచ్చవ్వ చనిపోతే చలనం లేదనిత, సొంత ఊరిలో మాజీ సర్పంచ్ చనిపోతే నోరు లేవదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పత్తాకు లేవని, కనీసం కట్టిన ఇండ్లు అయినా మరమత్తులు చేసి ఇవ్వండి అని వెంటపడితే అరకొర నిధులు విడుదల చేశారన్నారు. ఇంకో 1.5 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని, మంత్రిని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎలాగు తులం బంగారం ఇచ్చేది లేదని ముఖ్యమంత్రి చేతులు చేతులు ఎత్తేశారని కనీసం కొత్త రేషన్ కార్డులు అయినా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్లకు ప్రక్రియ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సీడీపీ, ఎస్‌డీపీతోపాటు టీయుఎఫ్ఐడీసీ ఫండ్, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కావాలని రాత పూర్వకంగా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గం అభివృద్ధికి కలిసి పోవడానికి సిద్ధంగా ఉన్నానని, కాని బిజెపి ఎమ్మెల్యే అని వివక్ష చూపెడితే ఎంతవరకు వెళ్ళడానికైనా సిద్ధంగా ఉన్నానని అన్నారు. సమావేశంలో బిజెపి కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలకు గుర్తుగా సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని మండల వైద్యదికారి దా రవీందర్ సూచించారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా గ్రామ ప్రజా ప్రతినిధులు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏడు సంవత్సరాలగా ఎందరికో వైద్య సేవలు అందించి హెల్త్ క్యాంపులు నిర్వహించి. ఆసుపత్రిలో పచ్చదనం పరిశుభ్రత కు కృషిచేసిన డాక్టర్ రవీందర్ సేవలను గుర్తు చేస్తూ నాయకులు యువత కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పం చులు జక్కం బాలకిషన్. కట్పల్లి నర్సారెడ్డి. మాజీ కో అప్షన్ మెంబర్ ఏ కే బుల్లెట్ ఖాన్, మాజీ ఎంపీటీసీ లు గంగారెడ్డి తలారి సతీష్ బంగ్లా వసంతరావు, జితేందర్ నాయక్, మాధవరి శంకర్ పాల్గొన్నారు